ప్రజాశక్తి

శుక్రవారం 23 డిసెంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రుణాలు అరకొర

- కౌలు రైతులకు విముఖత
- గృహ నిర్మాణానికి మొండిచేయి
- బ్యాంకర్ల తీరు.. తెన్నూ..

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



ఈ ఏడాది సెప్టెంబర్ 30న దుగ్గిరాల మండలం ఈమనిలో కౌలురైతులకు రుణాల కోసం యూనియన్ బ్యాంక్ వద్ద కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

వ్యవసాయానికి రుణాలు మంజూరులో బ్యాంకర్లు నిరాసక్తతను వ్యక్తం చేస్తున్నారు. 2022-23 ఖరీఫ్‌లో రుణాలు రైతులకు అరకొరగానే లభించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్వల్పకాలిక రుణాలు, పంట రుణాలు కలిపి మొత్తంగా వ్యవసాయం రంగానికి నిర్ణయించిన లక్ష్యంలో కేవలం 47.59 శాతమే రుణాలిచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.11,095 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా రూ.5,280 కోట్లే ఇచ్చారు. వీటిల్లో సగానికిపైగా వడ్డీలు చెల్లించిన వారికి పుస్తక సర్ధుబాటులో కొత్త రుణాలు ఇచ్చినట్టు నమోదు చేసినట్టు సమాచారం.

కౌలు రైతులకు కేవలం సిసిఆర్‌సి కార్డులు ఉంటేనే ఇస్తామని చెబుతున్న బ్యాంకర్లు వాస్తవ రైతులకూ రుణాలు ఇవ్వడానికి విముఖత చూపుతున్నారు. అయితే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 96.08 శాతం, ప్రాధాన్యత లేని రంగాలకు 85.15 శాతం రుణాలిచ్చారు. మొత్తం రుణ ప్రణాళికలో గృహ నిర్మాణానికి కూడా అతి తక్కువగా 21.54 శాతం రుణాలు మాత్రమే అందచేశారు. విద్యారుణాలు మాత్రం 37.94 శాతం ఇచ్చినట్టు లీడ్ బ్యాంకు అధికారులు రూపొందించిన అర్ధ సంవత్సర నివేదికలో పేర్కొన్నారు.

వ్యవసాయ రంగానికి ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8,304.94 కోట్ల మేరకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.3,189.69 కోట్ల రుణాలు ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు, వ్యవసాయ రుణాల కింద రూ.2,791.03 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.2,090.48 కోట్లు ఇచ్చారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.3,864.14 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా కాగా రూ.3713.54 కోట్లు అందచేశారు. విద్యా రుణాలు రూ.135.75 కోట్లకు గాను రూ.51.50 ▶ 2లో



విజయవాడ లెనిన్ సెంటర్ నుండి సిఆర్‌డిఎ కార్యాలయానికి ప్రదర్శనగా వెళుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

పని భద్రత కోసం పోరు

- సిఆర్‌డిఎను ముట్టడించిన రాజధాని పారిశుధ్య కార్మికులు
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

వార్త మెయిన్‌లో

చెత్త పన్నుపై ఉధృత ఉద్యమాలు

26న స్పందనలో వినతి, 28న ర్యాలీ, ధర్నాకు నిర్ణయం 8 లో

ఎస్టీలను గుర్తించండి.. : సిపిఎం

- గుర్తింపు కార్డులు, పథకాల వర్తింపు కోసం డిమాండ్
- కాకుమాను తహాశీల్దార్, పంచాయతీ కార్యదర్శికి వినతులు

8 లో



సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ చాగంటి పద్మావతి

రక్తహీనతను గుర్తించే విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఫర్ హిమోగ్లోబినోపతిస్, హిమోఫీలియా (ఐసిహెచ్‌హెచ్) సెంటర్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి గురువారం ప్రారంభించారు. శరీరంలో విటమిన్లు లోపించడం వల్ల చాలామందికి రక్తహీనత సమస్యలు ఎదురావుతాయని, వీటిని ముందుగానే గుర్తించడానికి ఐసిహెచ్‌హెచ్ కేంద్రం ఉపయోగ పడుతుందని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో ఫెథాలజీ విభాగం అధిపతి డాక్టర్ అపర్ణ, ప్రొఫెసర్ ఎం.రజని, డాక్టర్ పి.ఉమాప్రసాద్, డాక్టర్ సింధూర, డాక్టర్ జి.రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దేశానికి నష్టం

రూ.42.6 లక్షల కోట్ల ఆస్తులతో బలమైన ఆర్థిక సంస్థగా ఎల్ఐసి

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న వి.ఫణీంద్ర

ఎల్ఐసి సహా పలు ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ వాటాలను విక్రయించడం దేశ ప్రయోజనాలకు హానికరమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షులు వి.ఫణీంద్ర అన్నారు. అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయంలో గురువారం 'ప్రస్తుత ఆర్థిక విధానాలు-సవాళ్లు' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. కోట్లాది మంది పాలసీదారుల విశ్వసనీయత ఫలితంగా ఎల్ఐసి ప్రస్తుతం రూ.42.6 లక్షల కోట్ల ఆస్తులతో అత్యంత బలమైన ఆర్థిక సంస్థగా ఎదిగిందని తెలిపారు. రెవెన్యూకు సంబంధించి తాజాగా ఎకనమిక్ టైమ్స్ పత్రిక విడుదల చేసిన మొత్తం 500 రేటింగ్స్‌లో ప్రభుత్వ రంగ ఎల్ఐసి ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించిన చరిత్ర ప్రస్తుత ప్రభుత్వానికి ఏమాత్రం లేదని, గత 75 ఏళ్లుగా ప్రజలు ఏర్పరుచుకున్న ఆస్తులను బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఏకపక్షంగా తెగనమ్ము తున్నారని విమర్శించారు. మార్కెట్ వాటా, క్లెయిమ్‌ల పరిష్కారం, మౌలిక రంగాలకు పెట్టుబడులను సమకూర్చటం, టెక్నాలజీ, సాల్వెన్సీ మార్జిన్ వంటి పలు అంశాలలో ఎల్ఐసి అద్భుతమైన ఫలితాలను సాధించిందని తెలిపారు. దేశ విస్తృత ప్రయోజనాల కోసం ఎల్ఐసి మరింత శక్తివంతం కావాలని ఆకాంక్షించారు. 2023 జనవరిలో కలకత్తాలో జరిగే జాతీయ మహాసభలో ఎల్ఐసి పరిరక్షణకు తగిన ప్రచార కార్యక్రమాన్ని రూపొంది స్తామని చెప్పారు. సదస్సులో డివిజనల్ సంయుక్త కార్యదర్శి వివికె.సురేష్, ఉపాధ్యక్షులు కె.భాస్కర రావు, ఎం.రాజేశ్వరరావు, ఆర్.వి.ఎస్.శ్రీనివాస్, జి.శివరామకృష్ణ, పి.ఎం.రవికుమార్, ఐ.వెంకట్రావు, పి.శ్రీదేవి, పి.ఆర్.రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పోలీస్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు మాణిక్యాలరావు తదితరులు

పల్నాడు ఎస్పీపై టిడిపి నేతల వ్యాఖ్యలు బాధాకరం

- పక్షపాతం లేకుండా నిందితులపై కేసులు
- కొద్దిరోజులుగానే అలజడులు ఎందుకో టిడిపి ఆలోచించాలి
- పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - నరసరావుపేట

మాచర్ల పట్టణంలో ఈ నెల 16న దాడులను పోలీసుల శాఖ సమర్థవంతంగా సద్దుమణిగింపజేసిందని జిల్లా పోలీస్ అసోసియేషన్ సంఘం చెప్పింది. శాంతి, భద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు చేసిన కృషిని గుర్తించకుండా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా ▶ 2లో



తూకంలో కచ్చితత్వం పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-తెనాలి

వ్యాపారులు తూకం విషయంలో ఖచ్చితత్వం పాటించాలని, జీరో చూపించి తూకం వేయాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శేషసాయి అన్నారు. గురువారం లీగల్ మెట్రాలజి అధికారులు పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ డిప్యూటి కంట్రోలర్ షాలేము రాజు ఆధేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ శేషసాయి బృందం పలు వ్యాపారుల వద్ద తూకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఖచ్చితంగా తూకం కనిపించే విదంగా వ్యాపారులు ఏర్పాటు చేయాలన్నారు. జీరో చూపించి తూకం వేయాలన్నారు. అలా కాని పక్షంలో వినియోగదారులు మోసపోయే అవకాశం ఉంటుందన్నారు. వినియోగ దారులు కూడా అవగాహన కలిగి తూకంపై ప్రశ్నించాలన్నారు తూకంలో మోసాలను సహించేంది లేదని వ్యాపారులను హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది నాగేశ్వరరావు, తదితరులున్నారు.

పల్నాడు ఎస్పీపై టిడిపి నేతల వ్యాఖ్యలు బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడు, టిడిపి నాయకులు పల్నాడు జిల్లా ఎస్పీపై అనుచితంగా వ్యాఖ్యనించడం సరికాదని, ఆయన వాఖ్యలను ఖండిస్తున్నామని అసోసియేషన్ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు స్థానిక పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మాణిక్యాలరావు మాట్లాడారు. మాచర్లలో దాడుల సమాచారం అందిన వెంటనే పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారని, అవాంఛనీయ ఘటలకు తావివ్వకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఘటనలకు కారణమైన వారిని పక్షపాతం లేకుండా గుర్తించి వెంటనే వారిపై కేసులు నమోదుతోపాటు చట్టపర చర్యలు తీసుకున్నారని అన్నారు. అయినా టిడిపి నాయకులు సామాజిక మాధ్యమాల్లో మీడియాలో పోలీస్ వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడం, ఎస్పీని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదని అన్నారు. ఎస్పీ అసమర్థుడని, కిందిస్థాయి ఉద్యోగి అయినా ఇంతకంటే బాగా పని చేసేవారని అంటూ ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు పోలీస్ వ్యవస్థనే అవమానించేలా ఉన్నాయని అన్నారు. ప్రశాంత పల్నాడులో కేవలం కొద్దిరోజులగానే అలజడులు, గొడవలు ఎందుకు జరుగుతున్నాయో టిడిపి ఆలోచించాలన్నారు. టిడిపి నిర్వహించిన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం గురించి పోలీస్ వారికి ముందస్తు సమాచారం ఇవ్వనందునే అల్లర్లకు దారితీసిందన్నారు. పోలీస్ వ్యవస్థ పార్టీలకతీతంగా పని చేస్తుందని, టిడిపి నేతలు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ సంఘం కోశాధికారి సువర్ణరావు, సభ్యులు అప్పమ్మ పాల్గొన్నారు.

అంబటి రాజీనామా కోరుతూ బీసీల నిరసన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సత్తెనపల్లిలో కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల వద్ద ప్రభుత్వం ఇచ్చే పరిహారంలో సగం సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేసిన మంత్రి అంబటి రాంబాబు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ గుంటూరులోని టిడిపి కార్యాలయం వద్ద బిసి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. శ్రమజీవులు మరణిస్తే డబ్బులు అడగటం వైసిపి నేతలకు బిసిలపై ఉన్న ప్రేమను తెలియజేస్తుందని జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ ఆరోపించారు. కష్టజీవులుగా బతుకుతున్న వడ్డేరులను బెదిరించడం డబ్బులు అడగడం వైసిపి వారికే చెల్లిందన్నారు. పొట్టకూటి కోసం వచ్చి కొడుకును కోల్పోయిన పుట్టెడు దుఖ్ఖంలో ఉన్న వారిని సైతం పీడించడం మంత్రి అంబటి రాంబాబుకే చెల్లిందన్నారు. రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మల్లె ఈశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

బ్యారేజ్ హాయెస్ట్ ఛానల్‌కు తుప్పు


- 10 ఏళ్లు గడుస్తున్నా చేపట్టని మరమ్మతులు
- పాడవుతున్నా అధికారులకు కానరాని వైనం
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తులు



ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రకాశం బ్యారేజీ హాయెస్ట్ గడ్డర్లకు తుప్పు పట్టి పాడైపోతున్నాయి. ఏళ్లు తరబడి ఇవి పాడైపోతున్నా అధికారులు మాత్రం ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దాదాపు 10 ఏళ్లుగా వీటికి రంగులు, మరమ్మతులు చేయక పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. బ్యారేజి నుంచి నీటి విడుదలలో గడ్డర్లదే కీలక పాత్ర కావడంతో అవి పాడైపోతే గేట్లు ఎత్తే సమయాల్లో ఎటువంటి అవంతరాలు ఎదురౌతాయోనన్న ఆందోళనలు వాహనదారులు, పాదచారులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి మొత్తం 70 గేట్లు ,12 స్పిల్‌వే గేట్లు ఉన్నాయి. వీటి ద్వారా కృష్ణా, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, భీమవరం జిల్లాల్లోని లక్షలాది ఎకరాల పంట భూములకు సాగునీరు, తాగు సాగు నీరు అందుతుంది. దీని నిర్మాణ సమయంలో సుమారు13లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు,తాగు నీరు అందించే విధంగా దీనిని రూపొందించారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్, ఉండవల్లి ఎత్తిపోతల పథకం ఉభయ జిల్లాల్లో కొన్నిచోట్ల ఇటువంటి ఎత్తిపోతల పథకాలు కుశించుకుపోయాయి. ఏళ్ళ తరబడి కాలువలకు మరమ్మతులు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. కొన్ని ప్రాంతాల్లో అయితే గతంలో పంట భూములన్నీ కాంక్రీటు అరణ్యాలుగా (అపార్ట్‌మెంట్లు) మారిపోయాయి. ఫలితంగా ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ కింద గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, భీమవరం, బాపట్ల, జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లాల్లో సుమారు 5.62లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. విజయవాడ, గుంటూరు కార్పోరేషన్‌తోపాటు తెనాలి, మంగళగిరి తదితర మున్సిపాలిటీలకు కృష్ణా గుంటూరు జిల్లాల్లోని కొన్ని గ్రామాలకు తాగునీరు అందుతుంది. కృష్ణా పరిసర ప్రాంత జిల్లాల్లోని రైతుల పంట భూములకు నిత్యం నీటిని అందించి సస్యశ్యామలం చేసే ప్రకాశం బ్యారేజీని ప్రభుత్వం పట్టించుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి బ్యారేజీని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్యారేజిపై నిత్యం తిరిగే వందలాది వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన తక్షణమే స్పందించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరుతున్నారు.



తుప్పు పట్టిన ఛానల్



వెంటనే ఛానల్‌కు రంగులు వేయాలి : రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

తుప్పు పట్టి పాడైపోతున్న హాయెస్ట్ ఛానల్‌కు వెంటనే రంగులు వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆమేరకు అధికారులు చొరవ చూపి వెంటనే నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, భీమవరం జిల్లాల్లోని లక్షలాది ఎకరాల పంట భూములకు సాగునీరు అందిస్తున్న ప్రకాశం బ్యారేజీకి రిపేర్లు పట్ల ఏమాత్రం అలసత్వం వహించవద్దని అధికారులకు సూచించారు. హాయెస్ట్ ఛానల్స్‌కు సంవత్సరానికి ఒకసారి శుభ్రం చేసి రంగులు వేయాల్సి ఉండగా 12ఏళ్లు గడుస్తున్న రంగులు వేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు.ప్రతి ఏటా వర్షాలు కురుస్తున్నపుడల్లా బ్యారేజీ మీద వేసిన తారు రోడ్డు గుంతలు పడి పాడైపోతుందని, దీంతో వాహనాల రాకపోకలతో ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ఈ గుంతలు పడకుండా శాశ్వత పరిష్కారంకోసం ఇంజనీరింగ్ అధికారులు చొరవ చూపాలని కోరారు.

పిఎం స్వానిధి పథకంపై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

ప్రజాశక్తి-తెనాలి

పిఎం స్వానిధి పథకంపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు సూచించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆర్‌పిలు, సిఎంఎం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం వీధి వ్యాపారులను ఉద్ధేశించి ప్రవేశపెట్టిన పథకమని, దీనిని క్షుణ్ణంగా వారికి తెలిసే విదంగా ఆర్‌పిలు చర్యలు తీసుకోవాలన్నారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దరఖాస్తులు పూర్తి చేయు విధానంపై అవగాహన కల్పించాలన్నారు. వీధి వ్యాపారులకు ఈ పథకంలో తొలివిడతగా రూ.10వేలు, దానిని సకాలంలో చెల్లించిన వారికి రూ.20వేలు, అది కూడా క్రమంగా చెల్లిస్తే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణసౌకర్యం కల్పింస్తుందన్నారు. సమావేశంలో ఆర్‌ర్పిలు, సిఎంఎంఓలు పాల్గొన్నారు.

కరోనా ముప్పు తొలగిపోలేదు..జాగ్రత్త వహించాలి

కరోనా ముప్పు తొలగిపోలేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు తెలిపారు. చైనాతో పాటు పలు దేశాల్లో కోవిడ్ 19 పాజిటివ్ కేసులు నమోదౌతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ప్రజలు గుమికూడేటపుడు మాస్క్ ధరించాలని, శానిటైజర్ ఉపయోగించాలన్నారు.



అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో నిర్మాణం అయిన అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను గురువారం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ నెలాఖరికి పనులు పూర్తి చేసి, ప్రారంభవానికి సిద్ధం చేయాలని, కాంట్రాక్టర్ , కార్పొరేషన్ అధికారులను ఆయన కోరారు. ఆస్పత్రి చుట్టూ ఉన్న ప్రహరీ నిర్మాణాలపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా రూ.50 లక్షల నిధులతో దళితవాడలోని నిర్మాణమైన ఎస్సీ కమ్యూనిటీ హాలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి పట్టణ కన్వీనర్ బి. వేణుగోపాలస్వామి రెడ్డి, ఈ. డేవిడ్ రాజ్, కుంచనపల్లి గ్రామ నాయకులు మిరియాల రాంబాబు, చాగంటి వెంకటరెడ్డి, దొంతి రెడ్డి తిరుమలరెడ్డి, కూరపాటి సాంబిరెడ్డి, గడ్డం తాతారావు, నల్లపు డేవిడ్ పాల్గొన్నారు.

రుణాలు అరకొర

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు మంజూరు చేశారు.

జిల్లాలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. గృహ నిర్మాణానికి రూ.821.63 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం రూ.176.94 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. జిల్లాలో జగనన్న కాలనీల్లో రెండు లక్షల వరకు ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా వీరికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు,వ్యాపారులు నిర్మించుకుంటున్న భవనాలు, కొనుగోలు చేస్తున్న అపార్టుమెంట్లకు మాత్రమే రుణాలు ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి 26,120 మందికి రూ.176.94 కోట్ల వరకు రుణాలు ఇచ్చారు.

కౌలు రైతులకు నామమాత్రం


ఉమ్మడి గుంటూరు జిల్లాలో కౌలు రైతులకు కేవలం 7630 మందికి రూ.40.85 కోట్లు రుణాలు ఇచ్చారు. వీరిలో 410 మందికి మాత్రమే వ్యక్తిగత వ్యవసాయ రుణాలు రూ.3.39 కోట్లు ఇవ్వగా ఆర్ఎంజి గ్రూపులకు సంబంధించి 4351 గ్రూపులకు రూ.17.89 కోట్లు, జెఎల్‌జి 2643 గ్రూపులకు రూ.18.45 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించి 226 గ్రూపులకు రూ.1.12 కోట్ల ఇచ్చారు.

జిల్లాలోని కొన్నేళ్లుగా బ్యాంకులకు వివిధ రంగాలకు చెందిన వారి నుంచి వసూలు కావాల్సిన రుణ బకాయిలు కూడా వసూలు కావడం లేదు. జిల్లాలోని అన్ని బ్యాంకులలో మొత్తం రూ.35,820 కోట్ల వరకు డిపాజిట్లు ఉండగా రుణ బకాయిలు రూ.44.442 కోట్ల వరకు ఉన్నాయి. మొత్తం బకాయిల్లో వ్యవసాయ దారుల బకాయిలు రూ.12,116 కోట్లు ఉన్నట్టు చూపగా వివిధ తరగతులకు చెందిన 5 లక్షల మంది రూ.32 వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నట్టు అర్ధ సంవత్సర నివేదికల్లో పేర్కొన్నారు. వీరిలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల దారులు 1,11,562 మంది రూ.8,651 కోట్ల బకాయిలు ఉన్నట్టు తెలిపారు.

కోనేరు అభివృద్ధికి రూ.1.50 కోట్లు

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానా పరిధిలోని పెదకోనేరు అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు అయ్యాయని, ఆరు నెలల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం దేవస్థానం ఆవరణలో దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే ఆర్కే సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోనేరుకు పూర్వ వైభవం తీసుకురావాలని ఇప్పటివరకు కోనేరులో ఉన్న నీటిని తోడించడం జరిగిందన్నారు. అభివృద్ధికి దేవదాయ శాఖ నుండి కోటి 50 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని ఇవి చాలకపోతే ఇంకా నిధులు తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖ చెందిన అధికారులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్ ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బొల్లా

ప్రజాశక్తి-నూజెండ్ల

రైతుల సంక్షేమం కొరకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు మండలంలోని గురప్ప నాయుడుపాలెంసొసైటీ చైర్మన్ పారా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఐనవోలు సొసైటీ కార్యాలయంలోవినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్ ను అభినందన సభ గురువారం ఏర్పాటు చేశారు ఈ సభకు ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్ వైస్ చైర్మన్ కొమ్మిరిశెట్టి రామారావును ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు సొసైటీల ద్వారా కోట్ల రూపాయల లోన్లు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష నాయకులు అవగాహనతో మాట్లాడా లన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి జండా సుబ్బులు రామయ్య, ఎంపిపి మేడం జయరామిరెడ్డి, మండల కన్వీనర్ నక్క నాగిరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు

దాడి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఇంటిపై దాడి చేసి కిటికీలు, తలుపులు ధంసం చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. రూరల్ గ్రామం బుర్రిపాలెంకు చెందిన అరవైఐదేళ్ల మహిళ సుశీల ఇంటిపై అదే గ్రామానికి చెందిన కాబోతు విజయరాజు అలియాస్ జేసి, మరో ముగ్గురు కలిసి ఈ నెల 19వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణలో ఆ ఇంటి తలుపులు, కిటికీలు ధంసంచేసి, ఆమెను గాయపరిచినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

కోవిడ్ కొత్త వేరియంట్‌పై ఆందోళన వద్దు

డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

ప్రజాశక్తి-నరసరావుపేట

కొత్త కోవిడ్ వేరియంట్ పై ఆందోళన అవసరం లేదని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. గురువారం హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ కొత్త కోవిడ్ వేరియంట్ బి.ఎఫ్ -7 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుజరాత్, మహారాష్ట్ర లలో ఇప్పటికి 4 బి.ఎఫ్ 7 కేసులు నమోదయ్యాయని అందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. పాశ్చాత్య దేశాల ప్రజలతో పోలిస్తే భారత ప్రజలలో రోగనిరోధక శక్తి 90 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని ఈ నేపథ్యంలో బి.ఎఫ్-7 వలన పెద్ద ప్రమాదం ఏమి లేదన్నారు. కోవిడ్ లక్షణాలు ఉన్నవారు విధిగా సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్యుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సొంత వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. తప్పనిసరిగా సామాజిక దూరం పాటిస్తూ మాస్క్ ధరించాలని శానిటైజర్ వినియోగించుకోవాలని సూచించారు.

రాగిజావతో రక్తహీనత అరికట్టవచ్చు

ప్రజాశక్తి-అమరావతి



కర్ణాటక వారు వితరణ చేసిన రాగి జావను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బిసి జూపూడి విద్యార్థులకు ఒక్కొక్కరికి పది గ్రాముల చొప్పున పేరెంట్ కమిటీ సభ్యులు,ఉపాధ్యాయులు గురువారం అందజేశారు. రాగి జావను సేవించడం వలన ఎముకల బలహీనతను,రక్తహీనతను అరికట్టేందుకు రాగులు ప్రధాన పాత్ర పోషిస్తాయని ప్రధానోపాధ్యాయులు బలుసుపాటి సత్యనారాయణ విద్యార్థులకు తెలిపారు. రాగిజావను అందించేందుకు చొరవ తీసుకున్న స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు,మండల విద్యాశాఖాధికారి మేడా శ్రీనివాసరావులకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ ,మెప్మా సహకారంతో హ్యాండ్ వాష్ సెట్

ప్రజాశక్తి-వినుకొండ



స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో యూనిసెఫ్ ,మెప్మా వారి సహకారంతో ప్రజల సౌకర్యార్థం హ్యాండ్ వాష్ సెట్ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి మాట్లాడుతూ చైనాలో కరోనా వైరస్ మళ్లీ విజృంభించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పరికరాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, వైస్ చైర్మన్ లు రాజేష్ ఖన్నా , బేతం గబ్రీయల్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని కొండమోడు లో గల డా.బి.ర్ అంబేద్కర్ అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో రాజుపాలెం గ్రామా నికి చెందిన పల్నాడు జ్యోతి పత్రిక ఎడిటర్ రామిశెట్టి శ్రీనివాస రావు తండ్రి రిటైర్డ్ సి.ఐ కొటేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహుకులు గరికపాటి శంకర్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు నాయకులుగా రాణించాలి

ప్రజాశక్తి-అమరావతి



నేటి సమాజంలో మహిళలు నాయకులుగా రాణించాలని రైతు సమస్త డైరెక్టర్ నళిని పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన అమరావతిగుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం కోపరేటివ్ సొసైటీ లీడర్లకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా రైస్ సంస్థ డైరెక్టర్ ఆమె హాజరయ్యారు. గుడ్ షెఫర్డ్ సిస్టర్ సంస్థ కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. నళిని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రాణించాలన్నారు. ప్రతి ఒక్క గ్రూపు లీడర్ తన గ్రూపులోని సభ్యులకు ఆదర్శంగా ఉండి గ్రూపుని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ఈ కోఆపరేటివ్ సొసైటీ వలన మహిళలు ముందుకు వచ్చి ఆర్థికంగా కుటుంబాలను అభివద్ధి చేసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలోనే ఒక మంచి కో ఆపరేటివ్ సొసైటీ గా విప్రేసియా కో ఆపరేటివ్ సొసైటీ ఎదగాలన్నారు.దాని కావాల్సిన సహాయ సహకారాలు మా సంస్థ ఎప్పుడు అందిస్తుందని చెప్పారు. సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని, తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివద్ధి చెందాలన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 37,683
మిర్చి ఎగుమతి	: 39,004
మిర్చి నిల్వ	: 11,189

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 26,000
నెం.5	14,000- 15,000
273	10,300 - 23,000
341	11,700 - 25,000
4884	18,000 - 18,000
సూపర్ 10	16,500 - 22,000
నాన్ ఎసి	
తేజ	8,500 - 23,000
బడిగి	12,000 - 26,000
దేవనూరు డీలక్స్	14,000- 25,000
తాలుకాయలు	4,000 - 13,500
	ఎసి
334	10,000 - 26,000
నెం.5	15,500 -24,000
341	17,000 - 18,000
తేజ	8,500 - 20,500
బడిగి	20,000 - 27,000
తాలుకాయలు	5,500 - 11,000

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 27న ఆటల పోటీలు

ప్రజాశక్తి-వినుకొండ: నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఈనెల 27న తేదీన గుంటూరు జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు యన్. భగవాన్ దాస్ సెక్రటరీ నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇతర వివరాలకు యన్. భగవాన్ దాస్ సెక్రటరీ ఫోన్ నెంబర్ 8328110826 ను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బహుమతులు

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ,వ్యాసరచన పోటీలలో పాల్గొని ప్రభుత్వ జూనియర్ కళాశాల వినుకొండ విద్యార్థులు బహుమతులు సాధించారు. నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థిని,విద్యార్థులు బహుమతులు అందుకున్నారు.మొదటి బహుమతి పొందిన నలుగురిని డిసెంబరు 23 న జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నరసరావుపేట

పురపాలక సంఘం పరిధిలో ఎస్ టి వారికి రిజర్వ్ చేసిన 11 వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్టి కులానికి చెంది ఈనెల 22వ తేదీ నాటికి 35 ఏళ్ల వయసులోపు గలవారు ఈ నెల 29 లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్.ఎస్.సి లేదా తత్సమాన పరీక్షల యందు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆయా ఖాళీలకు సంబంధించి వివరాలను వార్డు సచివాలయం నందు,పురపాలక సంఘ కార్యా లయం నోటీసు బోర్డ్ నందు ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.



చేజర్లలో చెరువును పరిశీలిస్తున్న పిడి జోసెఫ్, సిబ్బంది

15వ తేదీలోపు చెరువు సుందరీకరణ

ప్రజాశక్తి-నకరికల్లు

అమృత ఉత్సవ్ కింద మండలంలోని చేజర్లలోని చెరువును పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి జోసెఫ్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 15వ తేదీ లోపు చెరువును సుందరీకరణ చేస్తామన్నారు. అలాగే, గుండ్లపల్లిలోని నీడనిచ్చే నర్సరీ మొక్కలు, మునగ మొక్కల నర్సరీను పరిశీలించారు. అన్ని గ్రామపంచాయతీలలోని పొదుపు సంఘాల మహిళలకు, ఉపాధి హామీ కూలీలకు, ఎవరికైనా కావాలంటే మొక్కలు పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పిడి వెంట ఎంపిడిఒ బండి శ్రీనివాసరెడ్డి, ఎపిఒ కె.ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పం చాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-యడ్లపాడు

ఈ నెల 25వ తేదీన స్థానిక పి.ఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటి, విజన్ ఫౌండేషన్, లింగారావుపాలెం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో రెగ్యులర్ షుగర్, బిపి పరీక్షలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రెండు నెలలకు సరిపడా మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. వైద్యశిబిరం పర్యవేక్షకులుగా సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్ వ్యవహరిస్తారని, డాక్టర్ కందుల రంగారావు, డాక్టర్ నూతలపాటి షణ్ముఖం డాక్టర్ జి.సుమలు వైద్యసేవలందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా క్యాంపు నిర్వాహకులు కోరుచున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీలలో 'వాగ్దేవి' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఈ నెల 18, 19 తేదీలలో గుంటూరులోని ఏసీ కళాశాల ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల మహిళల,పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్ లో వాగ్దేవి డిగ్రీ కాలేజీ మహిళలు పూల్ విన్నర్ సాధించి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే, పురుషులు పూల్ విన్నర్ సాధించి తృతీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు ,కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను అబినందించారు. కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ మద్దాల సైదారావు, రాయల ఆంజనేయులు, అధ్యాపకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు సరే.. సమస్యలు పరిష్కరించరే..?

- సమస్యలపై గళం విప్పిన అధికార పార్టీ కౌన్సిలర్లు
- వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని నిలదీత
- వినుకొండ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం





ప్రజాశక్తి - వినుకొండ

వార్డుల్లో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్టవేశాయని, గత కౌన్సిల్ ఎజెండాల్లో తీర్మానాలు చేసిన పనులు పూర్తిచేసి నూతన పనులు చేపట్టండి అంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం వినుకొండ మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 25 అంశాలతో కూడిన ఎజెండాను చదివి వినిపించి కౌన్సిల్ ఆమోదం పొందారు.

పనులు నేటికీ మొదలు పెట్టలేదు

తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ మాట్లాడుతూ గతంలో కౌన్సిల్ తీర్మానం పొందిన పనులు నేటికీ మొదలు పెట్టలేదని వాటిని పూర్తి చేసి నూతన పనులు చేపట్టాలని కోరారు. తమ వార్డు లో కుమ్మర బావి వద్ద డ్రైనేజీ, అరుణ థియేటర్ వద్ద డ్రైనేజీ పారిశుధ్య సమ స్యలపై గత కౌన్సిల్లో తీసుకురాగా తీర్మానం ఆమోదం పొందడం తప్ప ఇప్పటికీ పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లిం మైనారిటీ ఆస్తులను పరిరక్షించాలి

19 వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్కే భాష మాట్లాడుతూ వినుకొండలో క్రిస్టియన్ ఆస్తులు కాపాడుతున్న విధంగానే ముస్లిం మైనారిటీ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరారు. తమ వార్డులో పైప్ లైన్ నిర్మాణానికి గుంతలు తీసారే తప్ప పనులు పూర్చేయడంతో మురుగు నీరు నిలిచి పోయి త్రాగునీటి పైప్‌లైన్లలో మురుగునీరు వస్తోందని వివరించారు. పట్టణంలో చెత్త సేకరణ డస్ట్ బిన్ లు పగిలిపోయాయని, ట్రాక్టర్ల టాప్ అప్ లేక తడి పొడి చెత్త క్రిందకు కారుతూ పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పారిశుధ్య నివారణకు సరైన పరికరాలు లేవని, పిచ్చి చెట్లు తొలగింపుకు భాస్కన్ మిషన్ లేదని మంచి పరికరాలు కొనుగోలుపై దృష్టి సారించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. తిమ్మాయపాలెం రోడ్ లోని ఈద్గా స్థలం అన్యాక్రాంతమవు తోందని ప్రహరీ నిర్మించాలని కోరారు.

కొత్త డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయండి

23 వ వార్డు కౌన్సిలర్ గౌస్ బాషా మాట్లాడుతూ పెద్ద మసీదు బజార్ ప్రాంతంలో పారిశుధ్యం క్షీణించిందని, డస్ట్ బిన్లు కొత్తవి ఏర్పాటు చేయాలని, అలాగే ఉర్దూ స్కూల్ దగ్గర పిల్లలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ కాలువకు కనెక్టివిటీ లేదు

పదో వార్డు కౌన్సిలర్ వైస్ చైర్మన్ గాబ్రిల్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద నుండి శివయ్య స్తూపం వరకు నిర్మించిన డ్రైనేజీ కాలవకు కనెక్టివిటీ లేకపోవడం వలన మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కానిక్టివిటీ పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సిమెంటు పోల్స్ వేయాలి

31వ వార్డు కౌన్సిలర్ ఎమ్మెల్ రెడ్డి, కొంత మంది కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించాలని, పాత ఇనుప పోల్స్ ప్లేస్ లో సిమెంటు పోల్స్ వేయాలని, లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని, లైన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. 20 నెలలుగా అనేకసార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనేక సమస్యలను ఏకరు పెడితే తీర్మానాలు చేశారే తప్ప సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. ఆయా సమస్యలపై దృష్టి సారించి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను కోరారు.

పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ గత తీర్మానాలకు సంబంధించిన పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని అధి కారులను ఆదేశించారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైస్ చైర్మన్ రాజేష్ కన్నా, కౌన్సిలర్లు, కార్యక్రమంలో కమిషనర్ బి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా



జిల్లాలో నాడు-నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్న, నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినికులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జల జీవన మిషన్, నాడు-నేడు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్మితమవుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. బయో వేస్ట్ సెంటర్ కూడా ఉండేలా చూడాలని సూచించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిర్మితమవుతున్న పాఠశాలల అదనపు గదులకు సంబంధించి లేదా నూతన భవన సముదాయానికి సం బంధించిన పనులను వేగవంతం చేయాలని, ముడి సరుకుల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ, ఎపి ఎంఐడి సి, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దు

ప్రజాశక్తి-మాచర్ల



ధాన్యం రైతులు ప్రభుత్వ మద్దతు ధరను అందు కోవాలని పల్నాడు జిల్లా మేనేజరు జి.వరలక్ష్మి, జిడిసిసి బ్యాంక్ మేనేజర్ డి హరిగోపాల్, మాచర్ల మండల వ్యవసాయ శాఖాధికారి కె లక్ష్మారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కంభంపాడులో రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ఉదయం రైతులు షేక్ సయ్యద్ ఖాశిమ్, మురళీకృష్ణ ప్రసాద్‌ల ద్వారా 6.5 ఎకరాల భూమిలో సాగు చేసిన 250 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. క్విం టాల్‌కు రూ.2,060/-కు ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు వివరిం చారు. గ్రామంలోని రైతులు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి వరి తేమ శాతాన్ని పరీక్షించుకోవాలని అన్నారు. గోతాలు, హమాలీ ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ప్రభుత్వం భరించి 'ఎ' గ్రేడ్ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరకు తక్కువకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు.



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

మిర్చిలో జెమినీ వైరస్, తామర పురుగు

ప్రజాశక్తి-నరసరావుపేట

వ్యవసాయ శాఖాధికారులు సూచనలు మేరకు సాగు చేపట్టిన పొలాలను రైతులు సంరక్షించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిడి ఎఎం శివకుమారి అన్నారు. మండలంలోని కేసానుపల్లిలో రైతులు సాగు చేస్తున్న ప్రత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబుతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. మిరప పంటలో జెమినీ వైరస్, తామర పురుగులను గమనించారు. ఆయా పంటలను ఆశించిన తెగుళ్లను పరిశీలించి నివారణ చర్యలను వివరించారు. లేత మొక్క జొన్న పైరులో భాస్వరం లోపం, కత్తెర పురుగు గమనించినట్లు ఆయా పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య చర్యలు రైతులకు వివరించారు. సూక్ష్మ పోషక ఎరువులను వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని రైతులకు సూచించారు. కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఎవో అరుణచంద్ర, వ్యవసాయ విస్తరణ అధికారి షేక్.కరీమూన్, విఎఎ ఎస్ కె.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.





వరి పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోకి ఎమాజీగూడెంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వరి పంటకోత ప్రయోగాలు కుంచాల సుబ్బారావు పొలంలో మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. యూనిట్ నెంబర్ 0120 ప్రయోగం 9 లో 55 మీటర్ ల విస్తీర్ణంలో తడి ధాన్యం బరువు 5.16 కిలోగ్రాములు, ప్రయోగం నెంబర్ 10లో 5X5మీటర్ల విస్తీర్ణంలో 8.010 కిలో గ్రాములుగా నమోదైంది. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు ఎం. సాయికిరణ్, ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతి నిధి టి.వంశీకృష్ణ, గ్రామ రైతు కుంచాల వీరమ్మ, కె.సుబ్బారావు పాలుగొన్నారు.

కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి : ఏపిఆర్‌పిఎ

ప్రజాశక్తి-గుంటూరు

కనీస పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ (ఏపీఆర్‌పిఎ) రాష్ట్ర గౌరవాఅధ్యక్షులు అజయ్ కుమార్ అన్నారు. గురువారంఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ (ఏపీఆర్‌పిఎ) జిల్లా మహాసభ పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం రామసుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్స్ సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది బిక్ష కాదని, హక్కు అని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే గంగాధర్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షన్ దారులను మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెయ్యి రూపాయల పెన్షన్‌తో కుటుంబాలు ఎలా గడుస్తా యని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీసం పెన్షన్ రూ.10వేలు చేయాలని కోరారు. అనంతరం అసోసియేషన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శివశంకరరావు, రామ సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా వి.సాంబశివరావు, ఆది నికల్సన్, వెంకట్రావు, సాంబశివరావు, సహాయ కార్యద ర్శులుగా జాన్‌బాబు, మోహన్‌రావు, హనుమంతరావు, ఆర్‌ఎంఎస్ కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎం.వి.సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

హిందూ ఫార్మసీలో ఆన్‌లైన్ ప్లేస్‌మెంట్ టాక్ వెబినార్

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫినామ్ కంపెనీ, యుఎస్ఎ వారు ఆన్‌లైన్ ప్లేస్‌మెంట్ టాక్ వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫినామ్ ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ లీడర్ బి.ఎన్.కిశోర్ ఉద్యోగ అవగాశాల గురించి, శ్వాస జాబ్ ప్లాట్ ఫార్మ్ ద్వారా విద్యార్థులతో ప్రసంగించారు. ఈ వెబినార్‌లో బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్‌డి డాక్టర్ పి.సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్స్ విద్యార్థి అనిల్‌కుమార్‌కు పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు:వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ విభాగానికి చెందిన కుర్రా అనిల్ కుమార్ అనే విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కార్యాలయం తెలిపింది. 'డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ రిలియబుల్ డిలే బేస్డ్ పీయూఎఫ్ ఆర్కిటెక్చర్స్ ఫర్ అథెంటికేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు.వర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎన్.ఉషారాణి గైడ్‌గా వ్యవహరించారు. పీహెచ్‌డీ పొందిన కుర్రా అనిల్ కుమార్‌ను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు,సిబ్బంది అభింనందించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

ప్రజాశక్తి-తెనాలి

ఆధునీకరణ, అత్యాధునిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా దక్షిణ మధ్య రైల్వే పనిచేస్తోందని జీఎం అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. తెనాలి పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆధునీకరించిన వివిధ విభాగాల ప్రారంభోత్సవానికి గురువారం ఆయన ప్రత్యేక రైలులో తెనాలి వచ్చారు. తొలుత స్టేషన్‌లోని ప్లాట్‌పారాలు, వెయిటింగ్ రూమ్స్, లిఫ్ట్, విక్రయ కేంద్రాలను పరిశీలించారు. గూడ్స్ షెడ్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికాం వర్క్స్, రూ.1.30 కోట్లతో నిర్మించిన ఆర్పీఎఫ్ పోస్ట్ కమాండర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ-గూడూరు మధ్య ఆధునీకరణను సమీక్షించేందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అమిత్‌గోయల్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఆర్.ధనుంజయులు, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్, ప్రిన్సిపల్ ఛీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, విజయవాడ రైల్వే డిఆర్‌ఎం శివేంద్రమోహన్, ఏడిఆర్‌ఎం దవళ శ్రీనివాసరావు, స్టేషన్ మేనేజర్ డి.శ్రీనివాసమూర్తి, ఆర్పీఎస్ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఫతే ఆలిభేగ్, జిఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ సరస్వతి పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్, సిగ్నల్ విభాగాలకు స్విచ్ ఆన్ చేస్తున్న జీఎం

సిరిపురం ఉర్దూ స్కూల్లో డిఐ తనిఖీ

ప్రజాశక్తి-మేడికొండూరు

మండలంలోని సిరిపురం గ్రామంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలలో ఉప తనిఖీ అధికారి ఎండి ఖాసిం గురువారం సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. టెక్స్ట్ పుస్తకాల్లోని ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఇబ్రహీంకు ఉర్దూ డిఐ పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఉర్దూ మాధ్యమంలో బోధించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు తల్లిదండ్రుల వివరాలు పక్కాగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. అమ్మఒడి వంటి పథకాలకు విద్యార్థుల హాజరు తగ్గకుండా ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.



విద్యార్థి సామర్థ్యాలు పరిశీలిస్తున్న డిఐ ఖాసిం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున ఎంపిపి పద్మలీల తదితరులు

ప్రజాశక్తి కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరులో ప్రజాశక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండరును ఎంపీపీ భవనం పద్మలీల గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో కార్మిక కక్షకా పీడిత వర్గాల కోసం పని చేస్తూ జర్నలిజంలో ఒక ప్రత్యేకతను చాటుకొని దినదిన అభివృధి చెందుతున్న ప్రజాశక్తి దినపత్రిక యాజమాన్యానికి పాత్రికేయ మిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, భవనం సందీప్, సిఆర్‌పి దాసు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ మురళీ కాంత్

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు నెహ్రూ నికేతన్ విద్యార్థి

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాట్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యాడని కళాశాల డైరెక్టర్ దాసిరి మురళీకాంత్ గురువారం తెలిపారు. పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.సంజయ్ ఏపి స్కూల్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఈ నెల 13న వినుకొండలో నిర్వహించిన జిల్లాస్థాయి షటిల్ పోటీల్లో సత్తా చాటాడన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే అంతర్ జిల్లాల బాలుర విభాగంలో షటిల్ బ్యాంట్మింటన్‌కు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సంజయ్‌ను మురళీకాంత్ అభినందించారు.





ఓవరాల్ ఛాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్

ముగిసిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ పోటీలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 3వ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ పోటీలు-2022లో అతిథ్య రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 789 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో అగ్రస్థానిగా నిలిచింది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 780 పాయింట్లతో రెండో స్థానంలో నిలువగా, మధ్యప్రదేశ్ 3వ స్థానం కైవసం చేసుకుంది. గత శనివారం ఘనంగా ప్రారంభమైన ఈ జాతీయ పోటీల్లో క్రీడాకారుల కేరింతలు, విజయోత్సవ, ఆనందాల మధ్య పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ అతిథ్య రాష్ట్రంగా విజయవాడ, గుంటూరులోని వివిధ వేదికల వద్ద ఈ క్రీడలను నిర్వహించినప్పటికీ.. ప్రారంభ వేడుకలు నిర్వహించిన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికలోనే ముగింపు వేడుకలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి(గిరిజన సంక్షేమం) పీడిక రాజన్న దొర హాజరయ్యారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం చాంపియన్‌లకు ట్రోఫిలను ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. 22 క్రీడాంశాలలో ఛాంపియన్‌లుగా నిలిచిన వివిధ రాష్ట్రాల క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ ఈవెంట్‌ను నిర్వహించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి లభించినందుకు సంతోషంగా ఉందని, ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుని విజయవంతంగా పూర్తిచేసిందన్నారు. 22 రాష్ట్రాలకు చెందిన దాదాపు 4,300 మంది క్రీడాకారులు 6 రోజుల పాటు ఈ క్రీడల్లో పాల్గొన్నారని, ఆటల్లో గొప్ప క్రీడాస్ఫూర్తిని, స్నేహాన్ని ప్రదర్శించిన ప్రతి క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. జాతీయ క్రీడలు-2022 నిర్వహణ కోసం తక్కువ సమయంలో దాదాపు 7000 మందికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడలకు సంబంధించి సహకరించిన ప్రతి శాఖను డిప్యూటీ సీఎం రాజన్న దొర ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎమ్.జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19, బాల,బాలికల విభాగంలో విజేతలు

బాస్కెట్ బాల్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో సిక్కిం, రెండో స్థానంలో మిజోరాం, మూడోస్థానంలో మణిపూర్ నిలిచాయి. ఫుట్ బాల్ బాలుర విభాగంలో మొదటి స్థానంలలో జార్ఖండ్, రెండో స్థానంలో మణిపూర్, మూడోస్థానంలో వెస్ట్ బెంగాల్ సత్తా చాటాయి. ఫుట్ బాల్ బాలికల విభాగంలో మొదటి స్థానంలో జార్ఖండ్, రెండో స్థానంలో వెస్ట్ బెంగాల్, మూడోస్థానంలో సిక్కిం నిలిచాయి. హ్యాండ్ బాల్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్, రెండోస్థానంలో తెలంగాణ, మూడోస్థానంలో ఛత్తీస్ గడ్ పొందాయి. హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో మొదటిస్థానంలో మధ్యప్రదేశ్, రెండోస్థానంలో తెలంగాణ, మూడోస్థానంలో గుజరాత్ నిలిచాయి. హాకీ బాలుర విభాగంలో మొదటిస్థానంలో ఒడిశా, రెండోస్థానంలో గుజరాత్, మూడోస్థానంలో తెలంగాణ నిలిచాయి.

హాకీ బాలికల విభాగంలో మొదటిస్థానంలో మహారాష్ట్ర, రెండోస్థానంలో ఒడిశా, మూడోస్థానంలో గుజరాత్ కైవసం చేసుకున్నాయి.కబడ్డీ బాలుర విభాగంలో మొదటి స్థానంలో తెలంగాణ, రెండోస్థానంలో ఉత్తరాఖండ్, మూడోస్థానంలో ఛత్తీస్ గడ్ నిలిచాయి.కబడ్డీ బాలికల విభాగంలో మొదటి స్థానంలో కర్ణాటక, రెండోస్థానంలో తెలంగాణ, మూడోస్థానంలో ఒడిశా నిలిచాయి.ఖోఖో బాలుర విభాగంలో మొదటిస్థానంలో ఛత్తీస్ గడ్, రెండోస్థానంలో ఆంధ్రప్రదేశ్, మూడోస్థానంలో తెలంగాణ నిలిచాయి. ఖోఖో బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్, రెండోస్థానంలో మహారాష్ట్ర, మూడోస్థానంలో ఛత్తీస గడ్ నిలిచాయి..వాలీబాల్ బాలుర విభాగంలో మొదటిస్థానంలో ఆంధ్రప్రదేశ్, రెండోస్థానంలో తమిళనాడు, మూడోస్థానంలో తెలంగాణ నిలిచాయి. వాలీబాల్ బాలికల విభాగంలో మొదటిస్థానంలో తెలంగాణ, రెండోస్థానంలో మణిపూర్, మూడోస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచాయి.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి

కానిస్టేబుల్ కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా ఏఆర్ విభాగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమా దంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ రతన్ కుమార్ కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును ఎస్పీ రవి శంకర్‌రెడ్డి గురువారం అంద జేశారు. పోలీస్ శాఖ తరపున వ్యక్తిగత ప్రమాద బీమా పథ కం కింద మంజూరైన రూ.20.5 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో రతన్ కుమార్ భార్య వేదశ్రీకి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ మరణించిన పోలీసులు చేసిన సేవలు ఎనలేనివని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఎప్పుడు ఏ ఇబ్బంది కలిగినా వెంటనే పోలీస్ అధికారులను సంప్ర దించాలని, తప్పకుండా సహాయం చేస్తామని భరోసా ఇచ్చా రు. కార్యక్రమంలో ఎఎఒ రామారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, బి సెక్షన్ సూపరింటెండెంట్ షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.



పాల్వాయిలో ఇంటింటికి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలోని పాల్వాయిలో గురువారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వైసిపి నేత శ్యామల రవి కిషోర్ రెడ్డి నేతత్వంలో ఇంటింటికి రెండు చొప్పున వివిధ రకాల పండ్ల మొక్కలను మూడు వేల వరక పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈ మొక్కలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్య క్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సొంటిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎన్.భాస్కర్‌రెడ్డి, పసర్లపాడు బ్రహ్మారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచాలని వినతిపత్రం

ప్రజాశక్తి-వినుకొండ



మజ్లీస్ పార్టీ, ఇతర ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యం లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఐదు సం వత్సరాలు వయో పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహాసిల్దార్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ అధ్యక్షుడు షేక్ బాజిద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న పోలీస్ శాఖలో ఎస్సై , కానిస్టేబుల్ కొలువులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించడం జరిగిందని తెలిపారు, అభ్యర్థుల వయోపరిమితి పెంచక పోవడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా రెండు లక్షల మందికి పైగా నిరుద్యోగుల జీవితాల్లో నీలీ నీడలు కమ్ముకున్నా యన్నారు. కార్యక్రమంలో యమ్.ఐ.యమ్ పార్టీ అధ్యక్షుడు షేక్ బాజీద్, నబీ, నాసర్ వలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్.కేనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్‌లోని ఎపిఆర్‌జెసిలో గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సం దర్భంగా 49వ మ్యాథమెటిక్స్ ఒలింపి యాడ్‌లో జాతీయ స్థాయిలో జరిగిన పోటీ ల్లో విజేతలు పదిహేనుమందికి అసో సియే షన్ ఆఫ్ మ్యాథమాటిక్స్ నేషనల్ లెవెల్ జారీ చేసిన ప్రతిభా ధ్రువీకరణ పత్రా లను పంపిణీ చేశారు. శాస్త్రీయత కోసం, అంక గణిత ఖచ్చితత్వం కోసం రామా నుజన్ పాటు పడ్డారని వక్తలు కొని యాడారు. అధ్యాపకులు, విద్యార్థులకు కళాశాల ప్రిన్సి పాల్ చందు ఆంజనేయులు , గణిత శాస్త్ర అధ్యాపకులు శరత్, భౌతికశాస్త్ర అధ్యా పకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

గణితం మానవ జీవితంలో భాగం

ప్రజాశక్తి-ఈపూరు

గణితం మానవ జీవితంలో భాగమని ప్రధానోపాధ్యాయురాలు ఏవి విజయ కుమారి అన్నారు. గణితశాస్త్ర పితా మహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను మండలంలోని ఏ.ముప్పాళ్ళలో నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించగా జ్ఞాన దళం జట్టు విజేతలుగా నిలిచారు. గ్రామస్తులు కాకుమాను కోట య్య సహకారంతో విద్యార్థులకు బహు మతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలకు వెళ్లే విద్యా ర్థులకు రవాణా ఖర్చుల నిమిత్తం రూ.2,500 నగదు అందజేశారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు ఎల్.వెంకటేశ్వ ర్లు, ఫిజికల్ డైరెక్టర్ వైవి చిరంజీవిరావు పాల్గొన్నారు.

దమ్మాలపాడు జెడ్పిహెచ్‌ఎస్‌లో ..

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం గణిత ప్రదర్శన శాల నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గణిత బోధనలోని పలు అంశాలను ప్రాక్టికల్ గా చేసి ప్రదర్శించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వ హించి బహుమతులు అందజేసినట్లు పాఠ శాల హెచ్‌ఎమ్ మరియమ్మ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి ఉన్నత పాఠశాలలో..

ప్రజాశక్తి-నూజెండ్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు గణిత నమూనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పిఎంసి చైర్మన్ వంగూరు ప్రసాద్, ప్రధానో పాధ్యా యులు అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. గణిత ఉపాధ్యాయులు కిరణ్ బాబు, నాగే శ్వరరావు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో..

ప్రజాశక్తి-నాదెండ్ల

కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయులు వి.రమణ మాటా ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత క్విజ్ నిర్వ హించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గణిత ఉపాధ్యాయులు ఉషారాణి, మల్లేశ్వర రావు, స్నేహలత, వేణుగోపాల్ ,శ్రీకాంత్ పాల్గొన్నారు. నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా శ్రీనివాస రామా నుజన్ జయంతి నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు గణిత నమూనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పిఎంసి చైర్మన్ వంగూరు ప్రసాద్ ,ప్రధానోపాధ్యా యులు ఎస్.అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

మునుగోడు హైస్కూల్‌లో..

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధి మునుగోడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామా నుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి,గణిత ఉపాధ్యాయులు కె. ప్రసాదు,వి.శ్రీనివాసరావు, పెరేంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె.సలావుద్దీన్,ప్రముఖ విద్యా వేత్త బి.శివరామయ్య పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో..



ఈపూర్‌లో..



దమ్మాలపాడులో..



నూజెండ్లలో..



నాదెండ్లలో..

అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డుకు

రూ.148.95 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -బెల్లంకొండ

అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డుకు రూ.148.95 కోట్లు నిధులు మం జూర య్యాయి. నియోజకవర్గంలో 4 మండలాలను కలిపే ప్రధాన రహదారి రూపురేఖలు మార ను న్నాయి. ఇటీవల సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కలిసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు డబుల్ లేన్ రోడ్డు ఆవశ్యకతను వివరించారు. వెంటనే స్పందించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశా రు. గురువారం ముఖ్యమంత్రి కలిసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆయ నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణ శంకుస్థాపనకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆహ్వానించనున్నట్టు తెలిపారు.



సీఎం జగన్‌ని కలిసిన ఎమ్మెల్యే శంకరరావు

ఘనంగా సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఆదరణ మానవ సేవా సహాయ సమితి కార్యదర్శి పలుకూరి జోసెఫ్ బాబు ఆధ్వర్యంలో ది లేమెన్స్ ఇవాం జెలికల్ ఫెలోషిప్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



వినియోగదారుల హక్కుల పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-వినుకొండ

డిసెంబర్ 24 జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు వినియోగ హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లు శ్రీనివాసరావు, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులు మరియు బాధ్యత పై అవగాహన కలిగి ఉండాలని మీ సమీప ప్రజలలో కూడా అవగాహన పెంపొందించాలని ఏ సంద ర్భంలో నైనా వినియోగదారుడు నష్టపోతే సమీప జిల్లా స్థాయి వినియోగదారులు కమిషన్ ను ఆశ్రయించాలని సూచించారు. నూతన వినియోగదారుల రక్షణ చట్టం 2019లో వచ్చిన మార్పులను విద్యార్థులకు తెలియజేశారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్లైన్ ద్వారా మరియు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా 1915 కి కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎం.. జగదీష్, అర్థశాస్త్ర విభాగ అధిపతి జి అంజయ్య లు సంయుక్తంగా నిర్వహిం చారు. అకాడమిక్ సెల్ కోఆర్డినేటర్ రామా కే. కిషోర్, బెహరో, వాణిజ్య శాస్త్ర అధ్యా పకులు సిహెచ్ .విజయ, కల్పన కే. కోటేశ్వరరావు, ఎ.రమణ బాబు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడం కోసమే ట్యాబ్‌లు

ప్రజాశక్తి-మాచర్ల

విద్యా విధానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సంచలనాత్మకంగా ఉంటు న్నాయని ప్రభుత్వ విప్,ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక జడ్‌పి బాలికల హైస్కూల్‌లో గురువారం ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన ట్యాబ్‌ల పంపిణి కార్యక్రమంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ప్రభుత్వ విప్,ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. పోటి ప్రపంచంలో విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన విద్యను అందించే కృషిలో భాగంగానే ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, వైస్‌చైర్మన్ పోలూరి నరసింహారావు, జడ్‌పిటిసి పెదమల్లు స్వామి, శ్రీనివాసశర్మ, కుర్రి సాయిమార్కోండారెడ్డి, కౌన్సిలర్స్ సుభాని, జలీల్, సంతోష్,బూడిద శ్రీనివాసరావు,గట్ల కోట ిరెడ్డి, ఎం.ఇ.ఓ వేముల నాగయ్య, హెచ్‌ఎం ఐవి నాగమణి పాల్గొన్నారు.


విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ప్రజాశక్తి-రెంటచింతల

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి కార్పొ రేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి దేనని ఎంపిపి దాసరి చౌడేశ్వరి అన్నారు. గురువారం పాలువాయి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఎం.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఎంపిపి మాట్లాడుతూ పేద పిల్లలకు కం ప్యూటర్ విద్యపై అవగాహన కల్పించడానికి, ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తీసుకొచ్చి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలోఎంపిడిఒ గౌసియాబేగం, ఎంఈఓ వెంకటేశ్వర్లు ఎంపిటిసి ఎం.ఈశ్వర్ రెడ్డి, హెచ్‌ఎం నాగేంద్రమ్మ, సాగరబాబు తదితరులు పాల్గొన్నారు



విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి



పాలువాయి జెడ్‌పి పాఠశాలలో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

గణిత మేధావికి విద్యార్థుల ఘన నివాళులు..

ప్రజాశక్తి-గుంటూరు

ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 135వ జయంతి, గణిత దినోత్సవ వేడుకలు గురువారం పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు .విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు.

భాష్యం విద్యా సంస్థల్లో.. భాష్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాష్యం బ్లూమ్స్, భాష్యం లిటిల్ ఛాంప్స్ విద్యార్థుల ధారణా శక్తికి మెరుగుదిద్దే వక్తృత్వ పోటీలు, తార్కిక జ్ఞానాన్ని ప్రదర్శించే సెమినార్స్, గణిత మేధస్సును అంచనా వేసే క్విజ్ పోటీలు నిర్వహించారు. మ్యాథ్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది.వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు భాష్యం రామకృష్ణ బహుమతులు అందజేశారు. **కెఎల్‌పి స్కూల్‌లో..** స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శ్రీనివాసరామానుజన్ జయంతిని నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రవేత్తల చిత్రపటాలు, చార్టులు, వివిధ రకాల నమూనాలు ప్రదర్శించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. **సుమేధా హైస్కూల్లో..**స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో గణిత శాస్త్ర పితామహుడైన శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల గణిత చార్టులు, నమూనాలు ప్రదర్శించారు. నృత్య రూపంలో, పాట రూపంలో వివరించారు. ఫన్ మ్యాథ్స్ పజిల్స్, నమూనాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజ్ఞ స్కూల్లో..** స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పోటీలు, మ్యాథమెటిక్స్‌లో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఎండి సలీం, కె సుధారాణి, సౌభాగ్య లక్ష్మి, మోహన్ తదితరులు పాల్గొన్నారు **మలినేని ఇంజినీరింగ్ కాలేజిలో..** వట్టిచెరుకూరు మండలం, పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమక్షంలో ప్రముఖ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, అకడమిక్ అడ్వైజర్ జంపని కిషోర్ బాబు, డైరెక్టర్ డి. శ్రీనివాస్‌కుమార్, హెచ్‌ఓడి డాక్టర్ ఎ.ఎస్.కె.చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు అధ్యాపకులు పాల్గొన్నారు. **తాడేపల్లి రూరల్:** ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూలో గురువారం అంతర్జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు గణిత క్విజ్, గణిత రంగవల్లులు పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ఉమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు కే కాంతారావు తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**తుళ్లూరు:** రాయపూడిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతీయ గణిత దినోత్సవం జరిగింది. ప్రధానోపాధ్యాయులు వల్లభాపురం ప్రసాద్ మాట్లాడుతూ రామానుజన్‌ను ప్రతి ఒక్కరూ రామానుజమ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,అంగన్వాడీలు పాల్గొన్నారు.**తాడేపల్లి:**ఇష్టంగా చేస్తే గణితం చాలా సులభమని తాడేపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు తెలిపారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజమ్ జయంతిని గురువారం స్థానిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులు గణిత క్విజ్, గణిత రంగవల్లులు, గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిబిహెచ్ ప్రసాద్, అనిల్‌కుమార్, కోటేశ్వరరావు, ఎస్‌కె అన్వర్, నాంచారయ్య పాల్గొన్నారు.**ప్రత్తిపాడు:** గణితంలో వేగం, ఖచ్చితత్వం రెండు మూల స్తంభాలాన్ని గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు శివశంకరరావు అన్నారు. గురువారం పత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు జరిగాయి. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఏర్పాటు చేసిన గణిత ఎగ్జిబిషన్ పరిశీలించారు. విద్యార్థులు పలు నృత్య కార్యక్రమానలు చేపట్టారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మోహన్ రావు, సుబ్రమణ్యం, రామకృష్ణారాజు ,వెంకటేశ్వరి పాల్గొన్నారు.


భాష్యం విద్యా సంస్థల్లో..


కెఎల్‌పి స్కూల్‌లో.


వడ్డేశ్వరంలో ..


ప్రత్తిపాడులో..



వైద్య శిబిరం లో పాల్గొన్న డాక్టర్లు, క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

రోటరీ క్లబ్ పొన్నూరువారు గురువారం చింతలపూడిలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో డెంటల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి వారికి టూత్ బ్రష్, టూత్ పేస్టు అందజేసి దంతాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు అడపా పద్మలత, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రామారావు , సెక్రెటరీ శ్రీనివాసరావు, డాక్టర్లు రొటేరియన్ కొండపల్లి సీతారామయ్య, రొటేరియన్ రవిరాకేష్ దేవ్, రోటరీ సభ్యులు వెంకటేశ్వరరావు , రవీంద్రనాథ్ , భాను ప్రసాద్, రాధాకృష్ణ, రామకృష్ణ ,సాంబశివరావు పాల్గొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న మహిళలు ,విద్యార్థులు

లింగ వివక్షపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆడ -మగ అనే తేడా లేకుండా అందర్నీ సమానంగా పెంచాలని, లింగ వివక్ష చూపకూడదని కోరుతూ తాడేపల్లి మండల సమైక్య ఆధ్వర్యంలో గురువారం లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమం మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో జరిగింది. గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో డ్వాక్రా యానిమేటర్లు విద్యార్థిని విద్యార్థులకు లింగ వివక్ష, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం పొదుపు మహిళలతో దళితవాడలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్లు నల్లపు శివపార్వతి, కొండపల్లి యశోద, అంగన్వాడి టీచర్లు దయామని, వెంకటరమణ, కనకమ్మ , ఆయాలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న రాజేశ్వరరావు తదిరులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-తెనాలి

సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు బాధ్యతగా వార్డు అభివృద్ధికి కృషి చేయటం అభినందనీయమని పలువురు కొనియాడారు. వైసిపి నాయకులు, 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి భర్త రాజేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను రూరల్ గ్రామం అంగలకుదురులో ఆయన మిత్ర బృందం నిర్వహించారు. తంగిరాల ప్రవీణ్ మాట్లాడుతూ వైసిపిలో కీలకంగా ఉంటూ వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సామాజిక బాద్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కేక్ కట్‌చేయించి, అభిమానులకు పంచారు. కార్యక్రమంలో ఉన్నం భూషణం, నలుకుర్తి అశోక్, గొరికపూడి ధార్మిక్, గద్దల రాకేష్, వై.అశోక్, రాహుల్ పాల్గొన్నారు.



రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

బ్రహ్మానందపురంలో ఇటీవల చేపట్టిన రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. ఎయిమ్స్‌కు వెళ్లే రోడ్డుతో పాటు స్థానిక బ్రహ్మానందపురంలో స్థానికుల అవసరాలను గుర్తించి, సుమారు రూ.14 లక్షల ఖర్చుతో రోడ్డు వేయడం జరిగిందని తెలిపారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట వైసిపి పట్టణ కన్వీనర్ బి. వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి వై.డేవిడ్ రాజు, బి.పెద్దగాలయ్య, డి.రమేష్, డిఇ కృష్ణారెడ్డి, పలువురు ఎంటిఎంసి అధికారులు పాల్గొన్నారు.

సరస్వతి ఫౌండేషన్ దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెనుమాక ఏఎల్‌సి, ఆర్‌సిఎం చర్చిలలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ పొన్నూరు నియోజక వర్గ కార్యదర్శి పి. సత్యనారాయణ, సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ కూరపాటి సరస్వతి ఫౌండేషన్ ద్వారా పేదలకు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం పెనుమాక కార్యదర్శి ఎస్‌కె. పీర్‌సాహెబ్, అగ్రిగోల్డ్ కష్టమర్స్ , ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టిన్, మహిళా నాయకులు గుంటూరు సరిత, బంగారు సాల్మన్ రాజు, గుడిపూడి చలపతిరావు, వి.కుమారి, ఎన్. ప్రసన్నకుమార్, నెహ్రూదాస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ అపిరెడ్డి, మేయర్ తదితరులు



తాడేపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. స్థానిక కెవిపి కాలనీలోని మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డిఇఒ పి.శైలజ తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధతో అమ్మఒడ్డి, జెవికె కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, నాడు-నేడు వంటి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ప్రపంచ స్థాయిలో ప్రభుత్వ విద్యార్థులు పోటీ పడాలనే ఉద్దేశంతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందచేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె.గురువయ్య, ఉప విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, ఎంఇఒ ఖుద్దూస్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి:విద్య ద్వారా మాత్రమే పేదరికాన్ని జయించగలమని స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చెప్పారు. గురువారం రాజధానిలో భాగమైన పెనుమాకలో వందేమాతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బైజూస్ అప్లికేషన్‌తోకూడిన ట్యాబ్‌లు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం సుమారు రూ.55 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

తెనాలి:స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో గురువారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంఈవో మేకల లక్ష్మినారాయణ, కౌన్సిలర్లు కె. జయపాల్, జి. మానసారెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడికొండూరు :మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో గురువారం విద్యార్థులకు ఎమ్మెల్యే ఉండవల్లిశ్రీదేవి ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్యతోనే సాధ్యమని , పేదరికాన్ని జయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం శోభారాణి , ఎంఈఓ ఎం జయరామిరెడ్డి , సిరిపురం సర్పంచి కుంభ త్రివేణి , కన్వీనర్ తాళ్లూరు వంశీకష్ణ , అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు


ఎస్టీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న పాశం రామారావు, తదితరులు

ఎస్టీలను గుర్తించండి.. : సిపిఎం

- గుర్తింపు కార్డులు, పథకాల వర్తింపు కోసం డిమాండ్
- కాకుమాను తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శికి వినతులు

ప్రజాశక్తి - పెదనందిపాడు: (కాకుమాను)

మండల కేంద్రమైన కాకుమానులోని కొండపాటూరు రోడ్డులోని ప్రభుత్వాస్పత్రి ఎదుట నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు గుర్తింపు కార్డులివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబాలను సిపిఎం నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 50 ఏళ్ల నుండి చెరువు కట్టమీద నివసిస్తున్న 10 గిరిజన కుటుంబాలకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆధార్, రేషన్, ఓటు గుర్తింపు కార్డులు రాకపోవడం శోచనీయమన్నారు. మండల కేంద్రానికి అతి సమీపంగా నివసిస్తున్న వీరి పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించటం తగదన్నారు. వీరు దేశ పౌరులు కాదా? అని ప్రశ్నించారు. నాలుగు నెలల క్రితం ఇంటింటికి సిపిఎం కార్యక్రమంలో భాగంగా ఈ సమస్య మా దృష్టికి వచ్చిందని, వీరిని కలెక్టర్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లి సమస్యను విన్నవించామని తెలిపారు. అనంతరం సిపిఎం బృందం కాకుమాను పంచాయతీ కార్యదర్శిని కలిసి వివరణ కోరగా గిరిజనుల ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించామని, ఆధార్ కార్డులు అప్లికేషన్లు పెట్టించామని త్వరలో వారికి అందజేస్తామని తెలిపారు. అనంతరం తహశీల్దార్‌ను కలిశారు. అందరికీ గుర్తింపు కార్డులు, ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం కాకుమాను, పెదనందిపాడు మండలాల కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, డి.రమేష్‌బాబు, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్.యానాదులు పాల్గొన్నారు.

చెత్త పన్నుపై ఉధృత ఉద్యమాలు

- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం తీర్మానం
- 26న స్పందనలో వినతి, 28న ర్యాలీ, కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని నిర్ణయం


సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

చెత్తపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన పన్నును రద్దు చేసే వరకూ పోరాడతామని, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించాయి. సమయానికి సిపిఎం పట్టణ నాయకులు వివి జవహర్లాల్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశాలకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తలవంచుతోందని, ప్రజలపై తీవ్ర భారాలు మోపేందుకు సిఎం జగన్ పూనుకున్నాడని విమర్శించారు. చెత్తపై పన్ను అందులో భాగమేనని, నెలకు రూ.60 అని తాత్కాలికంగా చెబుతున్నా వాస్తవానికి మాత్రం నెలకు రూ.300 వసూలుకు నిర్ణయించారని తెలిపారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కె.కాశయ్య మాట్లాడుతూ అన్ని పన్నులనూ రాష్ట్ర ప్రభుత్వం పెంచుతోందని, రానున్న రోజుల్లో నీటి కుళాయిలకు మీటర్లు పెట్టి మరింత పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. టిడిపి నాయకులు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదలపై అనేక భారాలు మోపుతోందని, చెత్త పన్ను రద్దు కోసం జరిగే ఆందోళనలో టిడిపి పాల్గొంటుందని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు భారమైన చెత్త పన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

26న వినతి, 28న ర్యాలీ, ధర్నా

ఈనెల 26న కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో చెత్తపన్ను రద్దు కోసం వినతి పత్రం ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. చెత్త పన్ను రద్దు చేయాలని కోరుకునే అన్ని పార్టీలూ వినతి పత్రాలు అందించాలని సమావేశం కోరింది. ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సెంటర్ నుండి ర్యాలీ ప్రారంభించి సెంటర్, మెయిన్ బజార్ మీదగా, గాలి గోపురం సెంటర్ మీదగా కార్పొరేషన్ కార్యాలయం చేరుకొని అక్కడ ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకష్ణ, సిపిఎం పట్టణ నాయకులు ఎం.చలపతిరావు, దళిత సంఘాల నాయకులు కె.రామారావు, టిడిపి నాయకులు వి.మాధవరావు, నరేష్ పాల్గొన్నారు.

మానవ మనుగడలో ఫార్మారంగం కీలకం

చలపతి ఫార్మసీలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు



నమూనాలపై వివరిస్తున్న విద్యార్థులు, ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కోవిడ్ కాలంలో ఫార్మసీ రంగం ఆవస్యకత ప్రతిఒక్కరికీ తెలిసిందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో 16వ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. రెండ్రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి చలపతి విద్యా సంస్థల సెక్రెటరీ వై.సుజీత్ అధ్యక్షత వహించగా సదస్సు ఉద్దేశాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు వివరించారు. అతిథులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ శివరామప్రసాద్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి నుండి ప్రపంచం బయటప డడానికి పార్మారంగం చేసిన కృషి, ఆవిష్కరణలు ఎంతో దోహదపడ్డా యన్నారు. చాలామంది తమ దిన చర్యలను ఔషధాలతో ప్రారంభిస్తున్నారని గుర్తు చేశారు. పూర్వం నూతన ఔషధాలు, ఆవిష్కరణకు ఇతర దేశాలు, శాస్త్రవేత్తల మీద మనదేశం ఆధారప డేదని, ఇప్పుడా పరిస్థితి లేదని అన్నారు. 1995 తర్వాత మన పరిశోధన విభాగం, ఇతర దేశాలకు మించి అభివృద్ధి చెందిందని, నూతన ఔషధాల ఆవిష్కర ణతో మనుషుల ఆయుష్షు పెరిగిందని తెలిపారు. భాష్యం రామకృష్ణ మాట్లా డుతూ మనిషి జీవితంలో మందుల వినియోగం ప్రాధన్యమైందన్నారు. ఫార్మసీ లేని ప్రపంచాన్ని ఊహించలే మని చెప్పారు. ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 20వ శతాబ్దంలో సాంకేతి కత అత్యంత వేగంగా అభివృద్ధి చెంది ప్రతి మనిషి జీవితం సాంకేతికపై ఆధారపడిందని చెప్పారు. ఈ సాంకేతి కత ఫార్మా రంగంతో మిళితమైతే ఎన్నో అద్భుతాలు సృష్టించొచ్చన్నారు. ప్రతి విద్యార్థీ మారుతున్న సాంకేతికతనకు అనుగుణంగా జీవన సరళిని మార్చుకో వాలని, అప్పుడే పోటీ ప్రపంచంలో నిలబడగలమని సూచించారు. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ప్రేరణ ముఖ్యమని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా అది కలుగుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ప్రదర్శనలో 240 నమూనాలతో 390 మంది పాల్గొంటా రని చెప్పారు. తొలిరోజు 2500 మంది విద్యార్థులు నమూనాలను చూశారని, శు క్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగే ప్రదర్శనను చుట్టుపక్కల ప్రాంత విద్యార్థులు సందర్శించి విజ్ఞానం పొందాలని సూచించారు. ఇదిలా ఉండగా వివిధ ఔషదాలు, కాస్మొటిక్స్ తయారీ, వాటి నాణ్యత, ఉపయోగాలపై ప్రదర్శించిన నమూనాలు ఆకర్షించాయి.

ఉత్సాహంగా ముగిసిన వివిఐటి యువజనోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి


ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు

యువజనోత్సవాలు విద్యార్థుల కేరింతలు, డ్యాన్సలు, వివిధ రకాల ప్రదర్శనలతో ఉత్సాహంగా ముగిశా యి. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజిలో జాతీయ స్థాయి యువజనోత్సవాలు వివి వివిఐటి 2022-23 ఘనంగా ముగిశాయి. రెండ్రోజుల కార్యక్ర మాల్లో దాదాపు 6500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాస్కెట్ బాల్, ఖోఖో, వాలిబాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫోక్ డ్యాన్స్, ఆధునిక అష్టావదానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్, సర్క్యూట్ ఎరా వంటి సాంకేతిక అంశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యా ర్థులను కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. యవత దేశభక్తి కలిగి ఉండడం తోపాటు వారి కలలను సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టియూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ఐయూసి ఈఈ సభ్యులు దండు రామరాజు, లెఫ్టినెంట్ కమాండర్ కె.శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికా ర్జునరెడ్డి, డైరెక్టర్ వైవిఎస్ఎస్ఎస్వి ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దీక్షారంబ్ విజయాలకు పునాది కావాలి

ఎఎన్‌యు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కరుణ



ప్రశంసా పత్రాలు అందచేస్తున్న ప్రొఫెసర్ కరుణ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు: దక్షిణ భారతదేశంలోనే స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన రెండవ ప్రభుత్వ మహిళా కళాశాలలో చదివే విద్యార్థినులు ప్రతిజ్ఞతో జరుపుకునే దీక్షారంబ్ కార్యక్రమం ద్వారా ప్రతిభగల విద్యార్థినులుగా ఎదిగి ఉన్నత రంగాలలో స్థిరపడాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మొదటి మహిళా రిజిస్ట్రార్ బి.కరుణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో దీక్షారంబ్ 2022-23 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర పితామహుడు డాక్టర్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటా నికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ కరుణ మాట్లాడుతూ మహిళల విద్య దేశగతినే మారుస్తుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు ప్రస్తుత సమాజానికి తగ్గట్లు మహిళలు విద్యావంతులవడం తప్పనిసరని అన్నారు. పారిశ్రామికవేత్త మద్ది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధ్యత గల విద్యార్థులుగా ర్యాగింగ్, మొబైల్ చాటింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. కృష్ణాజిల్లా ఉప ఖజానా అధికారి ముప్పాళ్ల పల్లవి మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, ద్వారానే కళాశాల పూర్వ విద్యార్థినిగా గ్రూప్-1 అధికారినిగా ఎదిగానన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్, ఆర్జెడి డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి మాట్లాడారు. వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. సమర్ధనం ట్రస్టు ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. టస్టు రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, విద్యార్థి సంఘం కన్వీనర్ కె.సుబ్బరత్నమ్మ, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డి.విజయశ్రీ పాల్గొన్నారు.